





నెత్తురోడిన

రహదారులు

- వేర్వురు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం
- పాల్వంచ మండలంలో ముగ్గురు.. చర్ల మండలంలో ఇద్దరు.... 6
- మృతుల్లో ఇద్దరు యువకులు.. ఇద్దరు బాలురు...


డొంక కదులుతోంది...

- సీఎంఆర్ ధాన్యం అక్రమాలపై ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక
- సివిల్ సప్లయిస్ డీఎం, డీఎస్ఓలపై వేటు పడే అవకాశం..? 6
- పది రోజుల పాటు సెలవుపై వెళ్లిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్


మున్నేరు రక్షణ

గోడల రీడిజైన్

- నిపుణుల కమిటీ నివేదిక ప్రకారమే...
- వరదల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి 6



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం
5
బుధవారం, 16 అక్టోబరు 2024




ఇరిగేషన్ ఎస్ఈగా వెంకటేశ్వర్లు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదలశాఖ ఖమ్మం ఎస్ఈగా మంగళంపూడి వెంకటేశ్వర్లుకు పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ మంగళవారం ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (అడ్మిన్) జి అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఈ నర్సింగరావు సెలవులపై వెళ్లడంతో పాలేరు డివిజన్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న మంగళంపూడి వెంకటేశ్వర్లకు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈనెల 27 వరకు ఎస్ఈ నర్సింగరావు సెలవుపై వెళ్తున్నారు. అయితే ఆయన పదవీవిరమణ కూడా ఈనెలాఖరున ఉండడంతో ఆ తర్వాత మంగళపూడికే పూర్తి బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది.

ఖజానాకు గండి..

దసరాకు తగ్గిన కిక్కు





- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పడిపోయిన మద్యం విక్రయాలు
- గత ఏడాదితో పోల్చుకుంటే రూ.1.78 కోట్ల తగ్గుదల
- ఈ నెల 1 నుంచి 14 వరకు రూ.48.13 కోట్ల విక్రయాలు

వైరా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విజయదశమిని పురస్కరించుకొని మద్యం అమ్మకాలు విపరీతంగా పెరగ్గా ఉమ్మడి ఖమ్మంజిల్లాలో మాత్రం విక్రయాలు తగ్గాయి. గత ఏడాది విజయదశమి కంటే ఈ ఏడాది విజయదశమి సందర్భంగా రూ.1.78 కోట్ల మద్యం అమ్మకాలు పడిపోయాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 263 వైన్‌షాపులు, 50 బార్లు, మూడు క్లబ్‌లున్నాయి. ఖమ్మం జిల్లాలో ఖమ్మం-1, ఖమ్మం-2, నేలకొండపల్లి, సత్తుపల్లి, వైరా, మధిర, సింగరేణి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 122 వైన్‌షాపులు, 37 బార్లు, రెండు క్లబ్‌లు మొత్తం 161ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, అశ్వారావుపేట, మణుగూర్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 88 వైన్‌షాపులు, 13 బార్లు, ఒక క్లబ్ కలిపి మొత్తం 102 ఉన్నాయి. వీటన్నింటికీ వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు.

ఈ ఏడాది అక్టోబరు ఒకటి నుంచి 14వ తేదీ వరకు ఉమ్మడి ఖమ్మంజిల్లాలో హోల్‌సేల్ ధరల ప్రకారం రూ.48.13 కోట్ల మద్యం విక్రయాలు మాత్రమే జరిగాయి. గత 2023 అక్టోబరు 14వ తేదీ వరకు రూ.49.91 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఆప్రకారం రూ.1.78 కోట్ల మద్యం విక్రయాలు తగ్గిపోయాయి. ఈనెల 14వ తేదీ వరకు ఐఎంఎల్ 57.408 పెట్టెలు, బీరు 57,602 పెట్టెలు సరఫరా చేయగా గత ఏడాది ఈ నెలలో 14వ తేదీ వరకు ఐఎంఎల్ 56,584 పెట్టెలు, బీరు 68,049 పెట్టెలు సరఫరా చేశారు. అంటే గత ఏడాది అక్టోబరు కంటే ఈ ఏడాది అక్టోబరులో ఐఎంఎల్ 824 పెట్టెలు పెరగ్గా, బీరు మాత్రం 10,447 పెట్టెల సరఫరా తగ్గిపోయింది. 2022 అక్టోబరులో ఐఎంఎల్ 2,30,904 పెట్టెలు, బీరు 1,14,830పెట్టెలు సరఫరా చేశారు. వీటి విలువ రూ.184.33 కోట్లుగా ఉంది. ఇక 2023 అక్టోబరులో ఐఎంఎల్ 1,69,380పెట్టెలు, బీరు 1,49,462 పెట్టెలను సరఫరా చేశారు. వీటి విలువ రూ.141.66 కోట్లుగా ఉంది. 2022 అక్టోబరు కంటే 2023 అక్టోబరులో రూ.42.67 కోట్ల మద్యం అమ్మకాలు తగ్గాయి. గత ఏడాది అక్టోబరులో మద్యం షాపులకు టెండర్ల ప్రక్రియ నిర్వహించటం, నవంబరు ఒకటి నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభమైన నేపథ్యంలో అప్పుడు వ్యాపారులు వైన్‌షాపుల టెండర్లపైనే దృష్టిసారించి విక్రయాలపై అంతగా ఆసక్తి చూపలేదు. ఈ ఏడాది ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో పాత మద్యం పాలసీని అమలులోకి తీసుకువచ్చింది. దాంతో ఇదే నెలలో ఏపీలో మద్యం షాపులకు టెండర్ల ప్రక్రియ నిర్వహించి షాపులు ఖరారు చేశారు. బుధవారం నుంచి ప్రైవేట్ వైన్‌షాపులు ప్రారంభమవుతున్నాయి. తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మద్యం వ్యాపారులు గత 15 రోజులుగా ఏపీలోని మద్యం షాపులను దక్కించుకునే ప్రయత్నంలోనే నిమగ్నమయ్యారు. ఇక్కడ మద్యం అమ్మకాలపై అంతగా దృష్టి సారించలేదు. ఫలితంగానే మద్యం విక్రయాలు తగ్గాయనే భావన వ్యక్తమవుతోంది.

'సివిల్' డిస్‌ప్యూట్



సన్నబియ్యంపై ముదిరిన కయ్యం

- రూ.500 బోనస్‌తో కొనుగోలు కేంద్రాలకు పోటెత్తనున్న ధాన్యం
- సన్నబియ్యం లెవీపై అధికారులు, మిల్లర్ల మధ్య పేచీ
- క్వింటా ధాన్యానికి 67 కేజీల బియ్యం ఇవ్వాలంటున్న అధికారులు
- 60 కేజీలే ఇస్తామని స్పష్టం చేస్తున్న మిల్లర్లు
- సీఎంఆర్ బియ్యంపై ఇంకా ఎటూ తేలని వివాదం
- ముంచుకొస్తున్న వానాకాలం ధాన్యం సీజన్

ఖమ్మం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నా సన్నబియ్యం విషయంలో మిల్లర్లు, అధికారులకు మధ్య పంచాయితీ ఇంకా కొనసాగుతూనే ఉంది. వాస్తవానికి సీజన్‌కు ముందే మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి మిల్లుల వారీగా సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు నిర్ణయిస్తే అంతా సాఫీగా జరిగేది. కానీ గత ఏడాదికి సంబంధించి మిల్లర్లనుంచి భారీగా సీఎంఆర్ ధాన్యం మాయంకావడం, ఆ లెక్కలు తేల్చే విషయం జాప్యం కావడంతో కేసుల వరకు వ్యవహారం వెళ్లింది. ఈ లోగానే వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్ల సమయం కూడా రావడంతో ఇటు మిల్లర్లకు అధికారులకు ఇంకా సన్నబియ్యం పంచాయితీ నడుస్తూనే ఉంది.

సన్నబియ్యం 67 కేజీలపై పేచీ..

గతంలో ప్రతి సీజన్‌లోనూ దొడ్డురకం ధాన్యమే ఎక్కువ సీఎంఆర్ ధాన్యంగా మిల్లర్లకు వెళ్లేది. క్వింటాకు 67 కేజీల బియ్యం ఇచ్చేలా ఒప్పందంతో ధాన్యం మిల్లింగ్ చేయడం, ఆ తర్వాత బియ్యాన్ని లెక్కప్రకారం అప్పగించడం ఏటా జరుగుతున్న తంతే.. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈసారి పేదలకు సన్నబియ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించడంతో సన్నబియ్యం కొనుగోళ్లపైనే ఎక్కువగా దృష్టి పెట్టింది. సన్నాలు, దొడ్డురకాలు వేర్వేరుగా కొనుగోలు చేసేందుకు ప్రత్యేక కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. సన్నరకాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు ఉమ్మడిజిల్లాలో ఈసారి 90శాతం సన్నరకాలే రైతులు పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు గతం కంటే అధికంగా ధాన్యం వచ్చే అవకాశం ఉంది. ప్రైవేటు కంటే ధాన్యం ధరతోపాటు బోనస్ రూ.500 అదనంగా లభిస్తున్నందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇటీవల మిలర్లతో సమావేశం నిర్వహించింది. సన్నరకాల సీఎంఆర్ ధాన్యానికి కూడా క్వింటాకు 67 కేజీల బియ్యం అప్పగించాలని అధికారులు మిల్లర్లకు సూచించారు. దీనికి మిల్లర్లు ఒప్పుకోలేదు. సన్న రకాల్లో బియ్యం తక్కువగా వస్తాయని, 60 కేజీలకు మించి ఇచ్చేదిలేదని మిల్లర్లు తేల్చిచెప్పారు మిగిలిన 7శాతం నూక ఇస్తామని మిల్లర్లు తెలిపారు. దీనికి అధికారులూ ఒప్పుకోలేదు. దీంతో చర్చలు అసంపూర్తిగా ముగిశాయి.

ఈసారి నేరుగా గోదాములకే ధాన్యం..

దీపావళి తర్వాత ఉమ్మడిజిల్లాలో కొనుగోలు కేంద్రాలకు భారీగా ధాన్యం రాబోతోంది. ఖమ్మంజిల్లా పరిధిలో 322 కొనుగోలు కేంద్రాల ద్వారా 4.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు అంచనా వేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 165 కొనుగోలు కేంద్రాల ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద సేకరించిన ధాన్యాన్ని ముందుగా చేసిన కేటాయింపుల ఆధారంగా నేరుగా ఉమ్మడి జిల్లాలోని 115 మిల్లులకు పంపించేవారు. దీంతో అటు రవాణా చార్జీలు, ముఠా చార్జీలకు కొంత ఆదా అయ్యేవి. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని నేరుగా గోదాములకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. కానీ ఆ ధాన్యం గోదాముల నుంచి తదుపరి (మిగతా 6వ పేజీలో)



ఎస్‌జీటీ జిల్లా రెండవ ర్యాంకర్ ఉమకు పోస్టింగ్ ఉత్తర్వులు అందిస్తున్న డీఈవో

కొత్త టీచర్లకు పోస్టింగ్‌లు

- కౌన్సెలింగ్‌లో గందరగోళం
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- ఖమ్మంలో 520 మందికి, భద్రాద్రిలో413 మందికి కేటాయింపులు

ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఎంపికైన వారి పోస్టింగ్ కౌన్సెలింగ్.. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల తీరుతో గందరగోళంగా మారింది. మంగళవారం ఉదయం కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు అభ్యర్థులకు మెస్సేజ్‌లు పంపడంతో కొత్త టీచర్లందరూ ఖమ్మం నగరంలోని టేకులపల్లి డైట్ కళాశాలకు ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. కానీ విద్యాశాఖ అధికారులు తాపీగా వచ్చి.. కౌన్సెలింగ్ వాయిదా పడిందని, త్వరలో మళ్లీ కొత్త తేదీ చెబుతామని పంపించివేశారు. దీంతో అభ్యర్థులు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లిపోయారు. కానీ మధ్యాహ్నం 12:30 గంటలకు మళ్లీ విద్యాశాఖ అధికారులు కౌన్సిలింగ్‌కు అనుమతి వచ్చిందని అభ్యర్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని మొబైల్‌కు మెస్సేజ్‌లు పంపించారు. దీంతో అభ్యర్థులు హైరానా చెంది హడావిడిగా కౌన్సిలింగ్ సెంటర్‌కు మధ్యాహ్నం 2గంటలకు చేరుకున్నారు. ర్యాంక్‌ల ప్రకారం మొత్తం 520మందికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు అందించారు. కౌన్సిలింగ్ పూర్తయ్యే వరకు అర్ధరాత్రి అయింది. మొత్తం ఆరు టేబుళ్లు ఏర్పాటు చేసి ఒక్కో టేబుల్‌కు ఆరుగురు సిబ్బందిని ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. 21మంది మండల విద్యాశాఖ అధికారులు, డీఈవో కార్యాలయ సిబ్బందితో డీఈవో సోమశేఖరశర్మ స్వయంగా పర్యవేక్షించి అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. పోస్టింగ్‌లు పొందిన వారు బుధవారం మొదట మండల విద్యాశాఖ కార్యాలయంలో, అనంతరం వారికి కేటాయించిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

భద్రాద్రి జిల్లా కేంద్రంలోనూ డీఎస్సీ అభ్యర్థుల కౌన్సెలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సిలింగ్ ప్రక్రియ సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. మళ్లీ మధ్యాహ్నం 12 గంటలకు మళ్లీ మెసేజ్‌లు పంపడంతో అభ్యర్థులు హడావిడిగా కౌన్సిలింగ్ కేంద్రానికి వచ్చారు. మొత్తం 413మంది అభ్యర్థులకు అర్ధరాత్రి వరకు శిక్షణ తరగతులు నిర్వహించి ఆఖరున పోస్టింగ్ లెటర్స్ అందించారు .



బాలపేటలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతా...

- దేశమే ఖమ్మం వైపు కన్నెత్తి చూసేలా చేస్తా
- విద్య, వైద్యం, వ్యవసాయం, పశు, మత్స్యసంపదలో ముందుండాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

7



ఖమ్మంలో సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీలో మాట్లాడుతున్న శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- నగరానికి చేరుకున్న సీఎం కప్ క్రీడాజ్యోతి
- ఎస్పీ స్టేడియం నుంచి లకారం వరకు ర్యాలీ
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

వివరాలు : 6లో

బాణాసంచా షాపులకు అనుమతి తీసుకోవాలి



- పోలీసు కమిషనర్ సునిల్‌దత్

ఖమ్మం క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఖమ్మం జిల్లాలో బాణసంచా దుకాణాలు పెట్టుకోదలిచిన వ్యాపారులు.. ఈనెల 25వ తేదీ సాయంత్రంలోపు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాణాసంచా దుకాణాలలో వ్యాపారులు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని, పోలీసుశాఖ, నగరపాలక శాఖ, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలు ఏర్పాటుచేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఏఈ-5ఫామ్, సెల్ఫ్ అఫిడవిట్ చలాన రశీదు, ఆధార్‌కార్డు, ఫోటో జతచేసి సీపీ కార్యాలయంలో అందించాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారుచేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని సీపీ కోరారు.





పలు సంస్థలు బహూకరించిన ప్రశంసాపత్రాలు

- చదివేది పదో తరగతే.. కానీ కళల్లో కలికితురాయి
- బాలకథకుడిగా జాతీయస్థాయిలో గుర్తింపు
- పేపర్‌ఆర్ట్, చిత్రకళలో అంతర్జాతీయ బహుమతులు
- పద్యధారణ పోటీల్లోనూ ఎన్నో ప్రశంసలు
- బాలమేధావిగా నిలుస్తున్న సిద్దాంతపు సాత్విక్

చిచ్చర పిడుగు

ప్రతిభకు వయస్సుతో నిమిత్తం లేదని నిరూపిస్తున్నాడు ఆ విద్యార్థి.. అతడి చేతికి ఓ కాగితం ఇస్తే అది మంచి కళాకృతిగా మారుతుంది. ఓ కుంచెను అందిస్తే అద్భుతమైన చిత్రం ఆవిష్కృతమవుతుంది. చివరికి అతడు పలికితే పద్యాలు కూడా పరవశించిపోతాయి.. చదివేది పదో తరగతే అయినా విశేష ప్రతిభతో బహుకళా కోవిదుడిగా నిలుస్తున్నాడు భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటకు చెందిన సిద్దాంతపు సాత్విక్ సాయికుమారాచార్యులు..

అశ్వారావుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి, సాహితీ వేత్త డాక్టర్ సిద్దాంతపు ప్రభాకరాచార్యులు-నాగమణి దంపతుల కుమారుడైన సాత్విక్ చిన్నప్పటి నుంచి మాతృభాషపై పట్టు సాధించి శ్లోకాలు, పద్యధారణ పోటీల్లో ఎన్నో బహుమతులను కైవసం చేసుకున్నాడు. బాల కథకుడిగా చిన్నచిన్న కథలు రాస్తూ జాతీయ స్థాయిలో బహుమతులు అందుకున్నాడు. మరోవైపు చిత్ర కళలోనూ ప్రతిభ చూపి 'తానా' వంటి వేదికలపై అంతర్జాతీయ బహుమతులు పొందాడు. అంతేనా కాగితపు కళపై పట్టు సాధించి పేపర్‌తో అనేక ఆకృతులు సృష్టించి అంతర్జాతీయ పోటీల్లో ప్రథమ స్థానాన్ని పొంది అందరి మన్ననలు అందుకున్నాడు.

ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న సాత్విక్ చిన్నప్పటి నుంచే పలు అంశాల్లో తన మేధస్సును ప్రదర్శించేవాడు. దీన్ని గమనించిన తండ్రి ప్రభాకరాచార్యులు అతడికి తగిన రీతిలో తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించారు. మాతృభాషపై పట్టుసాధించేలా చేశారు. దాంతో ఎంతటి కఠినమైన పద్యాలనైనా అలవోకగా వల్లెవేసేవాడు. పోతన భాగవత పద్యాలు, భగవద్గీత శ్లోకాలు, వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాళింకాంబ సప్తశతి పద్యాలను అవలీలగా చెప్పగలడు. సాత్విక్‌లో పద్యాలతో పాటు చిత్రకళా నైపుణ్యం కూడా ఉంది. ఏదైనా చిత్రాన్ని ఒక్కసారి చూస్తే దాన్ని యథావిధిగా చిత్రీకరించి అనేక పోటీల్లో బహుమతులు సాధించాడు. ఇక అతడు తన ఖాళీ సమయాన్ని కూడా వృథా చేయకుండా న్యూస్ పేపర్‌తో ఆకృతులను తయారు చేస్తాడు. పేపర్‌తో రైలు, నెమలి, హంసలు, దేవుని మందిరం, ఫ్లవర్ వాజ్‌ల వంటివి తయారు చేసి తన ప్రతిభను చాటుకుంటున్నాడు. పేపర్ డైలతో కాడెద్దు, పంజరం, ఎడ్ల బండి, సైకిల్, వాల్ హ్యాంగింగ్స్‌ను తయారు చేసి రంగులతో అందంగా మలిచేవాడు. అంతర్జాతీయ వేదికైన తానా నిర్వహించిన కల్చరల్‌ఫెస్ట్‌లో పాల్గొని కాగితపు కళలో నాలుగువేలమందితో పోటీపడి ద్వితీయ స్థానం పొంది అందరి మన్నలు పొందాడు. అనేక పుస్తకాల్లో ఈ బుడతడు రాసిన కథలు, కవితలు అచ్చయ్యాయి.

విషయాన్ని అవగాహన చేసుకొని సందర్భోచితంగా ప్రదర్శించడం సాత్విక్ ప్రత్యేకత. ఇలా పలు రంగాల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్న సాత్విక్ చదువులోనూ ప్రథమ స్థానంలో నిలుస్తూ ఔరా అనిపిస్తున్నాడు.

సాత్విక్ సాధించిన విజయాలు..

- ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్-2020లో పేపర్ ఆర్ట్‌లో ద్వితీయ బహుమతి పొందాడు. ఇదే వేదికపై చిత్ర కళలోనూ బహుమతి పొందాడు.
- 2016లో రెండో తరగతి చదివే సమయంలోనే తెలుగు వర్ణమాలను 27 సెకన్లలో తిరగేసి చెప్పిన మొదటి వ్యక్తిగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించారు.
- 2017లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా నిర్వహించిన ఓరిగామి(కాగితపు కళ) పోటీల్లో ప్రథమ బహుమతి పొందాడు. రవీంద్రభారతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలో జరిగిన పద్య విభావరిలో పాల్గొని ప్రశంసాపత్రాన్ని, సత్కారాన్ని పొందాడు.
- 2018లోగురజాడ ఫౌండేషన్(అమెరిక) వారిచే ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.
- సమరస సేవాసమితి తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించిన భగవద్గీత పోటీల్లో పాల్గొని ప్రథక బహుమతిని పొందాడు.
- 300 నిమిషాల్లో 300 సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం పొందాడు.
- 2019లో విశ్వహిందూపరిషత్, అశ్వారావుపేట ప్రఖండ నిర్వహించిన భగవద్గీత పోటీల్లో ద్వితీయ బహుమతి పొందాడు.
- ఎడ్యుకేషన్ స్పెషల్, రాజమహేంద్రవరం వారు తరగతి వారీగా నిర్వహించిన గోదావరి ప్రతిభా పరీక్ష(తెలుగు)లో 5వ తరగతిలో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రథమ ర్యాంకు సాధించాడు.
- 2019లో విద్యారత్న బింగి మల్లేశ్వరి చారిటబుల్ ట్రస్ట్, న్యూఢిల్లీ వారి బాలప్రభ ప్రతిభా పురస్కారం పొందాడు.
- చిగురుమళ్ల శ్రీనివాస్ నిర్వహించిన కోటి పదార్చన కార్యక్రమంలో పాల్గొని భారత్ బుక్ఆఫ్ రికార్డులో స్థానం పొందాడు.
- తానా ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మనాన్న గురువు శతక పద్యార్చనలో పాల్గొన్నందుకు ప్రశంసా పత్రం పొందాడు.
- లాక్‌డౌన్ సమయంలో ఇతిహాస సంకల సమితి, హైదరాబాదు వారు నిర్వహించిన ప్రహేళిక పోటీలో పాల్గొని ఇతిహాస ప్రజ్ఞ పురస్కారం పొందాడు.
- 2020లో సామాజిక సమరసత వేదిక అంతర్జాలం ద్వారా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పద్యాల పోటీల్లో ప్రత్యేక బహుమతి పొందాడు.
- ఏక్తావిదన్-2020 సందర్భంగా రెయిన్‌బో సినిమాస్, తమిళనాడు వారు ఇంటర్‌నెట్ ద్వారా నిర్వహించిన చిత్రకళ, పేపర్ ఆర్ట్ పోటీల్లో బహుమతి పొందాడు.
- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ సైంటిస్ట్, ఎల్బా-వరంగల్, కోటమారపల్లి రేడియో వారు సంయుక్తంగా జాతీయస్థాయిలో నిర్వహించిన చిట్టి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందాడు. అతడి కథ రేడియో ద్వార ప్రసారంమైంది.
- ఆకాశవాణి, ఆదిలాబాద్ కేంద్రం నుంచి సాత్విక్ రాసిన 'మర్పు' కథ ప్రసారమైంది.
- ప్రణవపీఠం, వాగ్దేవి కళాపీఠం వారు నిర్వహించిన జాతీయస్థాయి భాగవతం పద్యాల పోటీలో ద్వితీయ బహుమతి(2021) పొందాడు.

Talent టాలెంట్



సాత్విక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి
- ఉమ్మడి జిల్లాకు చేరుకున్న సీఎం కప్ క్రీడాజ్యోతి

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మారుమూల గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి, ఆటలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని శాట్స్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్) చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా రాష్ట్ర క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద నిర్వహించిన క్రీడాజ్యోతి ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా నుంచి ఒక క్రీడాకారుడు ఒలంపిక్ పోటీలలో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని కోరారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఎన్నో పాఠాలను నేర్పిస్తాయని అన్నారు. గెలుపోటములు సంబంధం లేకుండా క్రీడలను స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాజ్యోతితో కూడిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు క్రీడాజ్యోతి ర్యాలీ మంగళవారం ఉదయం హైదరాబాద్ ఎల్బీ స్టేడియం నుంచి ప్రారంభమైన సాయంత్రం 4 గంటలకు స్థానిక సర్దార్ పటేల్ స్టేడియానికి చేరుకంది. రన్ ర్యాలీ ఎస్పీ స్టేడియం నుంచి ప్రారంభమై లకారం ట్యాంక్‌బండ్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, జిల్లాలోని క్రీడా సంఘాల బాధ్యులు, ఒలంపిక్ సంఘం ప్రతినిధులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

కొత్తగూడెం చేరిన సీఎం కప్ క్రీడాజ్యోతి

కొత్తగూడెం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు యువత దృష్టిని క్రీడల వైపు మళ్లించి క్రీడా తెలంగాణగా తీర్చిదిద్దడమే సీఎం కప్ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ మంగళవారం జిల్లాకు చేరుకుంది. ఈ క్రీడా జ్యోతి ర్యాలీకి స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనరెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం చలమల శ్రీనివాసరావు మెమోరియల్ పార్కు వద్ద స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభించారు.ఈర్యాలీలో విద్యార్థులు, యువత, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్పోర్ట్స్ అథారిటికి సంబంధించి అనువైన స్థలాన్ని చూపిస్తే క్రీడామైదానం ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. సీఎంకప్ అనంతరం సుమారు 500మంది క్రీడాకారులు బయటకు వస్తారన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ అద్భుత అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. జిల్లాలోని ఏ మూల చూసిన మంచి అథ్లెటిక్స్ ఉన్నారని, ఒకవైపు ఇల్లెందు, భద్రాచలం, పవర్‌లిఫ్టింగ్‌కు హబ్‌లా ఉన్నాయన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామీణ క్రీడలను వెలికి తీసేవిధంగా సీఎంకప్‌ను రూపొందించారన్నారు. ర్యాలీలో డీఎస్పీ రెహమాన్, క్రీడాశాఖ అధికారి పరందామరెడ్డి, వివిధక్రీడాసంఘాల క్రీడాకారులు పాల్గొన్నారు.

నెత్తురోడిన రహదారులు

- వేర్వురు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం
- పాల్వంచ మండలంలో ముగ్గురు... చర్ల మండలంలో ఇద్దరు....
- మృతుల్లో ఇద్దరు యువకులు.. ఇద్దరు బాలురు...



నరేష్, సారయ్య



మురళీకృష్ణ , రేవంత్

పాల్వంచ/చర్ల, అక్టోబరు 15: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మంగళవారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. వీరిలో పాల్వంచ మండలంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బూర్గంపాడు మండలం బుడ్డగూడెంకు చెందిన సోడే నరేష్(30) స్థానికంగా ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సోడే సారయ్య(27) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఇద్దరూ కలిసి మంగళవారం మధ్యాహ్నం జింకలగూడెంలో ఓ విందుకు హాజరయ్యారు. అనంతరం వ్యక్తిగత పనిమీద బైక్‌పై పాల్వంచ బయలుదేరారు. ఈ క్రమంలో బైక్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో నరేష్ తలకు బలమైన అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ సారయ్యను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ అతడికి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఇక మరో ఘటనలో పాల్వంచలోని ఇందిరాకాలనీలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి పంచాయతీలో నివాసముంటున్న వేమన నాగరాజు(48)స్థానికంగా హమాలీగా పనిచేస్తున్నాడు. పని విషయమై అతడు పాల్వంచలోని ఇందిరాకాలనీకి వచ్చి తిరిగి వెళుతుండగా పాల్వంచ వైపు నుంచి మణుగూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు అతడు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నాగరాజు తలకు తీవ్ర గాయమైన అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ టౌన్ ఎస్ రాఘవయ్య తెలిపారు.

చర్ల మండలం ఎదురుగుట్టల వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్లు అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. చర్ల మండలానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై ఎదురుగుట్టలకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో సుబ్బంపేట శివారులో ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మురళీ కృష్ణ (16), చింతలపూడి రేవంత్ రాజ్(16) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో యువకుడు షేక్ యాకూబ్ గాయాలతో బయటపడ్డాడు. చర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిఎస్సీ నాన్‌లోకల్‌లో పది మంది ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు15: (ఆంధ్రజ్యోతి): డిఎస్సీ 2024లో నాన్ లోకల్‌లోపదిమంది అభ్యర్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. అందులో ఏపీలోని శ్రీకాకుళంలో ఇద్దరు, కృష్ణ జిల్లాకు చెందిన ఒక్కరు కాగా మిగిలిన వారి వివరాలు ఏప్రాంతం వారో ప్రస్తుతం చెప్పలేమని తెలిపారు. డిఎస్సీ కౌన్సిలింగ్‌లో మెదటిగా నాన్‌లోకల్ అభ్యర్థుల కౌన్సిలింగ్ నిర్వహించారు. తొలుత రిపోర్ట్ చేయగా అందులో వారు ఏ ప్రాంతానికి చెందిన వారో పూర్తి వివరాలు ఉంటాయి. న విద్యాశాఖ అధికారులు వివరాలు చెప్పకుండా దాచిపపెట్టటం ఎందుకో వారికే తెలియాలి. కాగా ఎంపికైన వారిలో శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన కె నీలవేణి, శ్రీకాకుళం జిల్లా పాలకుంటకు చెందిన వి. దివ్య ఉన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని డైట్ కళాశాలలో జరిగిన కౌన్సిలింగ్ నియామక పత్రాలు అందుకున్నారు. కృష్ణా జిల్లాకు చెందిన మరో అభ్యర్థి కౌన్సిలింగ్‌లో నియామక పత్రాం అందుకున్నాడు. మిగిలిన వారి వివరాలు, వారికి ఎక్కడ పోస్టింగ్‌లు ఇచ్చింది డిఈవో చెప్పటం లేదు.

మున్నేరు రక్షణ గోడల రీడిజైన్

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్నేరుపై రక్షణ గోడలు రీడిజైన్ చేయిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల కాలంలో ఖమ్మంలోని పలు ప్రాంతాలను ముంచేసిన మున్నేరు వరదలకు శాశ్వత పరిష్కారం చూపేలా రీడిజైన్ చేయించడం కోసం నిపుణుల బృందాన్ని నివేదిక కోరినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం నగరంలో 46 వ డివిజన్‌లోని సారథినగర్‌లో మంగళవారం ఆయన స్ట్రీమ్ వాటర్ డ్రెయిన్‌కు శంకస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. మున్నేరు వరదకు, ఖమ్మం నగరంలో నీరు పోటెత్తడంతో 15 డివిజన్ల వరకు నీటిముంపుకు గురయ్యాయాని చెబుతూ.. మళ్లీ మున్ముందు అలాంటి పరిస్థితి రాకుండా ఉండేలా మున్నేరుపై రక్షణ గోడల ఏర్పాటు రీడిజైన్ చేయించాలని ముఖ్యమంత్రికి చెప్పినట్లు తెలిపారు.వరదల తీవ్రతను అంచనా ఆధారంగా నిపుణులు బృందంతో కొత్తగా డిజైన్ చేయాలని నిర్ణయించినట్లు అన్నారు. ఎగువ నుంచి వచ్చిన వరద నదిలోకి ఎలా వెళ్లాలి, నదిలో వచ్చే వరద ఖమ్మం నగరంలోకి రాకుండా ఎలాంటిచర్యలు చేపట్టాలనే అంశంపై, శాశ్వత పరిష్కారం దిశగా డిజైన్ చేయించనున్నట్లు తెలిపారు. కాగా నగరంలో నిర్మించే డ్రెయిన్లుకూడా అదేరకంగా మున్ముందు ఇబ్బందులు లేకుండా కట్టడాలు జరిగేలా కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు సూచించినట్లు తెలిపారు. కాగా, గతంలో మున్నేరుకు వచ్చిన వరదల అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ సమయంలో మున్నేరుపై రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయాలని అధికారులు తీసుకున్న నిర్ణయంపై సెప్టెంబరు 12న రక్షణ గోడలు రీడిజైన్ చేస్తారా? శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. గతంలో ఉన్న వరదల దృష్ట్యా అప్పటి రిటైనింగ్ వాల్ డిజైన్ చేశారనీ, కానీ అంతకుమించిన వరదలు వచ్చిన సందర్భంలో మళ్లీ రీ డిజైన్ చేయాల్సిన అవశ్యకత ఉన్నట్లు పేర్కొంది.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాలల కరస్పాండెట్‌లు

సంప్రదాయ విద్యపై ప్రభుత్వం చిన్నచూపు

- డిగ్రీ కళాశాలల నిర్వాహణ భారంగా మారటంతోనే నిరవధిక బంద్‌కు పిలుపు
- ఫీజు బకాయిలు విడుదల చేస్తేనే కళాశాలల మనుగడ
- విలేకరుల సమావేశంలో డిగ్రీ కళాశాలల కరస్పాండెట్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ కళాశాలల్లో విద్యార్థులకు అందించే సంప్రదాయ విద్యపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం నాయకులు అన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు ఆర్జేసీ విద్యా సంస్థల చైర్మెన్ గుండాల కృష్ణ, ప్రియదర్శిని కరస్పాండెంట్ కాటేపల్లి నవీన్‌బాబు, సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌ఎస్ కరస్పాండెంట్ వి. మోహన్‌రెడ్డి, గాయత్రి కరస్పాండెంట్ సునీల్‌కుమార్, కవిత మోమెరియల్ కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మెండి వైఖరి వల్లనే ఫీజు రీ యింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, ఈ విదానం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు విద్యకు దూరం కానున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు చెల్లిస్తామని అనటంతోనే విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలలకు ఫీజులు చెల్లించటంలేదని అన్నారు. ప్రభుత్వం చెల్లించకపోవటంతోనే మూడేళ్లుగా అప్పులు తెచ్చి కళాశాలలు నిర్వహిస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో డిగ్రీ విద్యను బోధించే అధ్యాపకులు లేక ఇబ్బందులు రానున్నాయని అన్నారు. కళాశాలల నిర్వాహణ భారంగా మారటంతోనే నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేని పక్షంలో ఉద్యమించిక తప్పదని అన్నారు. కేవలం కళాశాలల యాజమాన్యాలే కాగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు బకాయిలు వచ్చేంత వరకు ఈ పోరాటంతో ముందుండాలని కోరారు.

రైతులకు వర్షాల భయం

- కోత దశకు వచ్చిన వరి పంట
- భారీ వర్షాలు కురిస్తే నేలకొరిగే ప్రమాదం
- కొన్నిచోట్ల అమ్మకానికి సిద్ధంగా ధాన్యం

ఖమ్మం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సరిహద్దు ఆంధ్రాలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా రైతులకు తుఫాన్ భయం పట్టుకుంది. గతనెలలో కురిసినఅతి భారీవర్షాలతోనే ఉమ్మడిజిల్లాలో సుమారు 70వేల ఎకరాల పంటల నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి, పత్తి, మిర్చి వంటి పంటలకు నష్టం జరిగింది. ఆతుఫాన్ వర్షాలనుంచి కోలుకుంటున్న రైతులకు ఇప్పుడు మరో తుపాన్ పొంచి ఉండడంతో ఉమ్మడిజిల్లా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ప్రస్తుతం వరి పొట్ట, కోత దశలో ఉంది. సుమారు మూడున్నర లక్షల ఎకరాల్లో ఉమ్మడి జిల్లాలో వరి సాగవుతోంది. కోతకు వచ్చే తరుణంలో భారీవర్షాలు పడితే వరిపొలాల్లోని చేతికి వచ్చిన పంట చేలోనే నష్టపోయే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆకాశం వైపు చూస్తు ఎక్కడ వాన పడితే ఎక్కడ నరష్టం వస్తుందోనన్న ఆందోళనలో రైతులున్నారు. మరోవైపు ఉమ్మడిజిల్లాలో సుమారు మూడున్నరలక్షల ఎకరాల్లో పత్తి పంట కూడా సాగవుతుంది. ప్రస్తుతం పత్తి తీత సమయం కావడంతో పత్తి పంట కూడా చేతికి వచ్చింది. ఈతరుణంలో భారీవర్షాలు పడితే పత్తి కారిపోవడం, నల్లబడి నాణ్యత దెబ్బతిని ధర క్వింటాకు వెయ్యినుంచి రూ.1500రైతులు కోల్పోయే అవకాశం ఉంది వర్షం పడితే పత్తిరైతుకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో మిర్చితోపాటు మొక్కజొన్న తదితర పంటలు కూడా రైతులు వేశారు. అధిక వర్షాలు పడితే మిర్చికి ఎర్రబడడం, వేరుకుళ్ల రావడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. గాలివానలు వస్తే మొక్కజొన్న కూడా నేలమట్టం అయ్యే ప్రమాదం నెలకొంది. సరిహద్దు ఆంధ్రాలో పెనుతుఫాన్ ప్రభావం జిల్లాపై కూడా ఎంతో కొంత ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.



వర్షానికి తడవటంతో ధాన్యం రాశిని తిరగదోడుతున్న రైతులు

సన్నబియ్యం పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

మిల్లులకు వెళుతుందా లేక గోదాంలోనే సన్నబియ్యం ఇచ్చి మిల్లర్లు ధాన్యం తీసుకెళ్తారా అన్నది తేలాల్సి ఉంది. అయితే ముందు క్వింటా ధాన్యానికి ఎన్ని కేజీల సన్నబియ్యం ఇవ్వాలన్న విషయంపై అధికారులకు, మిల్లర్లకు మధ్య చర్చలు జరగకపోవడంతో సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్‌పై అధికారులనుంచి స్పష్టత కరువైంది. మిల్లర్లు కూడా గత నాలుగేళ్లుగా సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ చేస్తున్న చార్జీలు సుమారు రూ.50కోట్ల వరకు రావాలని, అలాగే ధాన్యం క్వింటాకు 60కేజీల బియ్యం ఇస్తామని, 2022-23 యాసంగి సీజన్‌లో టెండర్ పాడిన ధాన్యానికి డబ్బులు కడుతున్నా అందుకు తగిన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదని మిల్లర్లు ఇటీవల కలెక్టర్‌కు తెలిపారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ ఉంటుందని, క్వింటాకు 67కేజీల బియ్యం ఇవ్వాల్సిందేనని అధికారులనుంచి మిల్లర్లకు ఆదేశాలు వెళ్లాయి. దీనికి మిల్లర్లు ససేమిరా అనడంతో సన్నబియ్యం పంచాయితీ ఇప్పట్లో తేలేలా కనిపించడం లేదు.

డొంక కదులుతోంది...

- సీఎంఆర్ ధాన్యం అక్రమాలపై ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక
- సివిల్ సప్లయీస్ డీఎం, డీఎస్‌వోలపై వేటు పడే అవకాశం..?
- పది రోజుల పాటు సెలవుపై వెళ్లిన అదనపు కలెక్టర్

ఖమ్మం అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని కొణిజర్ల మండలం ఎస్ఏఆర్ రైస్ మిల్లుతో పాటు పలు చోట్ల సీఎంఆర్ ధాన్యం గల్లంతుకు సంబంధించి జిల్లా అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ బృందం ఇటీవలె కొణిజర్ల మండలంలోని రైసుమిల్లుల్లో జరిపిన తనిఖీల్లో రూ. 81 కోట్ల విలువైన ధాన్యం గల్లంతైనట్లు బయటపడింది. జిల్లాలోని మరికొన్ని రైస్ మిల్లులో కూడా సీఎంఆర్ ధాన్యం బియ్యం ఆడించకుండానే తరలించినట్లు గుర్తించారు. ఈ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్ శ్రీజను విచారణాధికారిగా నియమించారు. ఆమె పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించిన క్రమంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారికి నివేదిక పంపించారు. నెలవారీ పర్యవేక్షణ లేకపోవడం వలనే అక్రమాలు చోటు చేసుకున్నాయని, సివిల్ సప్లయీస్‌లోని సిబ్బంది, అధికారులు దీనికి బాధ్యులుగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇప్పటికే ఆ శాఖ టెక్నికల్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు ధాన్యం గల్లంతైన అంశంపై కమిషనర్ ఆదేశాల మేరకు డీఎం, డీఎస్వో వివరణ సైతం ఇచ్చారు. దీంతో ఇద్దరిపైనా రేపో మాపో చర్యలుంటాయని అంటున్నారు. ఇదిలావుండగా, జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లడంతో ఈ విషయం కూడా చర్చనీయాంశంగా మారింది.

నేటితో జాతర ముగింపు



కారేపలి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామం లో ఈనెల 12న ప్రారంభమై కొనసాగుతున్న కోటమైసమ్మమ్మ తల్లి జాతర మంగళవారం నాలుగోవ రోజుకూడ కొనసాగింది.జాతరకు పరిసరప్రాంతాలనుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఐదవరోజు బుధవారంతో ముగుస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గతం కంటే ఈ ఏడాది విజయవంతంగా జరిగిందన్నారు.

టేకు కలప పట్టివేత

దుమ్ముగూడెం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజి పరిది పెదనల్లబల్లి లో రూ.40వేల విలువ గల టేకు ముక్కలను రేంజి అధికారి కమల దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు నిఘా వేసిన సిబ్బందికి ఒక ఇంటి పరిసరాల్లో అక్రమంగా దాచి ఉంచిన టేకు ముక్కలు దొరగ్గా, వాటిని భద్రాచలం రేంజి కార్యాలయానికి తరలించారు. మంగళవారం రాత్రి పదకొండు గంటల సమయంలో దాడులు నిర్వహించగా బుధవారం కేసు నమోదు చేశారు. డీఆర్ఓ శ్రీనివాస్, ఎఫ్ఎస్ఓ నందా, ఎఫ్‌బీవో జ్యోత్స్న తదితరులున్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం

టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం

- కార్మికుల హక్కుల కోసం 1978లో ఇఫ్టూ నిర్మాణం
- 20న హైదరాబాద్‌లో విలీన సభ
- సన్నాహక సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రామయ్య



మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి రామయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల పరిరక్షణ, కార్మిక చట్టాల రక్షణ కోసమే 1978లో కార్మికుల కోసం ఏర్పడిన ఐఎఫ్‌టీయూను జాతీయ స్థాయిలో ఒక్కే కార్మిక గొంతుకగా వినిపించేందుకు టీయూసీఐ(ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా)లో ఐఎఫ్‌టీయూ ని విలీనం చేసేందుకు కార్యచరణ జరుగుతుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య వివరించారు. మంగళవారం ములకలపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సభలో రామయ్య మాట్లాడుతూ ఐఎఫ్‌టీ యూ నిర్మాణం నుంచి విలీనానికి దారి తీసిన విషయాలను, అంశాలను వివరించారు. 26 రంగాల కార్మికులకు ఐఎఫ్‌టీయూ సంఘం ద్వారా పోరాటాలు చేసి వారి హక్కులను కాపాడిందన్నారు. లక్ష మంది కార్మికుల సభ్యత్వం కలిగి ఉందని, బీడీ, భవన, ఆటో, మెకానిక్, కేజీబీవీ, హమాలీ, మిల్, గోదాం, మున్సిపల్, సింగరేణి, గ్రామ పంచాయతీ వంటి ముఖ్యమైన రంగాల్లో ఐఎఫ్‌టీయూ సంఘం కీలకంగా పనిచేస్తోందని వివరించారు. ఐఎఫ్‌టీయూ దేశ వ్యాప్తంగా నిర్మాణంలో బాగంగానే టీయూ సీలో విలీనం చేసేందుకు ఈనెల 20న హైదరాబాద్‌లో విలీన సభను ఏర్పాటు చేశామని వివరించారు. నాయకులు కే శ్రీనివాస్, పగిడికత్తుల రామదాసు, శీలం లెనిన్, బీ రమేశ్, సక్రు, జోగా కోటేశ్వరరావు, ప్రభాకర్, మాధవరావు, కందుల వెంకటేశ్వర్లు, నాగరాజు, శ్రీనివాస్, అంబేద్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతా..

- దేశమే ఖమ్మం వైపు చూసేలా చేస్తా
- విద్య, వైద్యం, వ్యవసాయం, పశు, మత్స్యసంపదలో ముందుండాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రక్షణ కిట్లు అందజేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశం మొత్తం ఖమ్మం జిల్లా వైపు చూసే రోజుల్ని తీసుకొస్తానని, విద్యా, వైద్యం, వ్యవసాయం, పశు, మత్స్య సంపద, రహ దారులు, చెరువులతో పాటుగా అన్ని రంగాల్లో ఖమ్మం జిల్లాను దేశంలోనే నెంబర్ 1 స్థానంలో నిలబెట్టేందుకు తాను కృషి చేస్తానని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అందుబాటులో ఉండి పనిచేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నియోజకవర్గ వ్యాప్తంగా మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపనలు చేశారు.

బాలపేట చెర్వు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేప పిల్లల్ని నీటిలోకి వదిలారు. అక్కడే ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. పామాయిల్ సాగులో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఎంతోమంది రైతులు నిత్యం బస్సులు తీసుకొని జిల్లాకు వచ్చి పామాయిల్ సాగును పరిశీలించి రైతులతో మాట్లాడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో చేపలకు ఉమ్మడి రాష్ట్రంలోనే డిమాండ్ పెరిగిందని, సముద్రాలు సమీపంలో ఉన్న ప్రజలు కూడా ఖమ్మం జిల్లా చేపల తెప్పించుకుంటున్నారని, ఎటువంటి ఎరువులు వాడకుండా చేపలు పెంపకమే ఇందుకు కారణమన్నారు. జిల్లాలో ఉన్న 16వేల మంది మత్స్య కుటుంబాలకు చేపల పెంపకం ద్వారా ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు.

గతంలో ఏపీ నుంచి చేపలు దిగుమతి జరిగేదని ఇప్పుడు ఉమ్మడి రాష్ట్రం నుంచే చేప పిల్లల కోసం ఖమ్మం వస్తున్నారని తెలిపారు. చేపల పెంపకం ద్వారా నీలి విప్లవం వచ్చిందన్నారు. మార్కెటింగ్ వంటి విషయాల్లో ప్రభుత్వం చేపల పెంపకందారులకు సహాయం అందిస్తోందన్నారు. జిల్లాలో ప్రతి చెర్వుకు సరిహద్దులు ఏర్పాటు చేసి పెన్సింగ్ నిర్మాణం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. విద్యా, వైద్య రంగాల్లో ఖమ్మం జిల్లా ఆదర్శంగా ముందుకు వెళ్తుందన్నారు. ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలకు మంచి విద్యాబుద్ధలు నేర్పించాలని, ఆధునిక సమాజంలో గంజాయి, మత్తు పదార్థాలను యువత తీసుకోవటం ఎక్కువైందని అటువంటి విషయాల పై తల్లిదండ్రులు తమ పిల్లల్ని పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీకి భూములు అందించిన బాధితులకు న్యాయం చేస్తామని హామి ఇచ్చారు. ఈ మేరకు ఇప్పటికే కలెక్టర్‌కు ఆదేశాలిచ్చామన్నారు. కాగా, నగరంలో జరుగుతున్న కార్యక్రమాలకు కేఎంసీ సిబ్బంది ఎవరూ హాజరు కాకపోవటంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు లకావత్ సైదులునాయక్, మలీదు జగన్, పాలేపు విజయవెంకటరమణ, సొసైటీ అధ్యక్షులు రావూరి సైదుబాబు, తాతా రఘురాం, మాజీ సర్పంచులు బాతుల సుధాకర్‌రమణ, వాంకుడోత్ విజయదీప్తా, నాయకులు ఎస్వీ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

మణుగూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మణుగూరులో రూ. 1.80 కోట్లతో నిర్మించనున్న ఎస్టీ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. మణుగూరులో పర్యటించిన మంత్రికి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గంలో బూర్గంపాడు నుంచి మంత్రి వెంట ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పర్యటనలో పాల్గొన్నారు. మణుగూరు హనుమాన్ జంక్షన్ నుంచి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీని మంత్రికి స్వాగతం పలుకుతూ నిర్వహించారు. అనంతరం మణుగూరు డీఎస్పీ కార్యాలయం మందున్న ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలో శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఈఈ తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాదాపు 12 గదుల నిర్మాణానికి రూ.1.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఐటీడీఏ పీవో, డీడీ, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, పినపాక నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి చేయాలని టీయూడబ్ల్యూజే పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు పూజారి చందు మంత్రి పొంగులేటికి విన తి పత్రాన్ని అందించారు. మంత్రి ఈ విషయంపై త్వరలోనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

గ్రామపంచాయతీ కార్యాలయం ప్రారంభం

బూర్గంపాడు (ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిదిలోని తాళ్లగొమ్మూరులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, ఐటీసీ సీఎస్ఆర్ నిధులు రూ.12లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారయణ, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ తూళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీడీవో జమలారెడ్డి, ఐటీసీ ఉన్నాతాదికారులు శ్యామ్‌కిరణ్, చెంగళరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ విజయగాంధీ, వెంకటేశ్వర్‌రెడ్డి, సతీష్, లక్ష్మీనారయణరెడ్డి, కృష్ణ, వాసు, తదితరులు పాల్గొన్నారు.



అదనపు గదులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

నేడు నేలకొండపల్లిలో మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి (ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉదయం నేలకొండపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనను న్నారు. ఉదయం 10గంటలకు నేలకొండపల్లి భక్తరామదాసు ధ్యాన మందిరం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ, కాటమయ్య రక్షాకిట్ల పంపిణీ, పీఎస్సార్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

దళితబంధు యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి

- యూనిట్‌ల స్థితిగతులపై కలెక్టర్ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు దళితబంధు యూనిట్లను సద్విని యోగం చేసుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మి ల్‌ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో నిర్వహించిన సమా వేశంలో మంజూరైన దళితబంధు యూనిట్ల స్థితిగతులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ స్థానికసంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, చింతకాని మండలంలో స్యాచురేషన్ పద్ధతిలో 3 వేలకు పైగా దళితబంధు యూనిట్‌లు మంజూరు చేసుకుని గ్రౌండ్ చేశామన్నారు. 800 పైగా దళిత బంధు యూనిట్‌లకు రెండో విడత యూనిట్ల గ్రౌండింగ్ త్వరలో చేయనున్నట్లు తెలిపారు. రెండవ విడతలో మంజూరు చేసిన దళితబంధు యూనిట్‌లను ప్రతి 15 రోజులకు ఒకసారి పరిశీలించాలన్నారు. దీనికి సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో మంజూరు చేసిన దళితబంధు యూనిట్లలో పశుసంవర్ధక శాఖకు సంబంధించి 492, వ్యవసాయ యంత్రాంలకు సంబంధించి 223, వాహనాలు 430, ఇతర 242 యూనిట్‌లు డైవర్ట్‌అయినట్లు తెలిపారు. ఇవి ఎక్కడికి డైవర్ట్ అయ్యాయో గమనించాలని, దీనికి గల కారణాలను తెలుసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వేణుమనోహర్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా రవాణాధికారి వెంకటరమణ, చింతకాని ఎంపీడీవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు పాత్రల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

- ఐటీడీఏ పీవో రాహుల్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ఉన్న 11 కళాశాలల వసతిగృహాలకు పాత్రల సరఫ రాకు టెండర్లు దాఖలు చేయాల ని భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 11 కళాశాలల వసతి గృహాలకు ప్లేట్లు, గ్లాస్లు, బౌల్స్, ఇతర అవసరమైన వంట పాత్రలు, వడ్డన పాత్రలు సరఫరా చేయడానికి ఆసక్తి గల టెండర్‌దారులు టెండర్ ఫారంలను ఉపసం చాలకుల వారి కార్యాలయం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం నుంచి అక్టోబరు 16 నుంచి 23 వరకు కార్యాలయ పనివేళలో రుసుము చెల్లించి పొందాలన్నా రు. సీల్డ్ టెండర్లను అక్టోబరు 23 సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించా లన్నారు. టెండర్లు ఐటీడీఏ పీవో సమక్షంలో అక్టోబరు 24న మధ్యాహ్నం 12 గంటలకు తెరుస్తారన్నారు. పూర్తి వివరాలకు 9440640070, 9441908672 ఫోన్ నెంబర్లకు కార్యాలయ సమయంలో చేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి ఫిట్స్‌తో బాలుడి మృతి



గోపి మృతదేహం

నేలకొండపల్లి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగాపురంతండాకు చెందిన ధనావత్ గోపి (16) చెరువుమాధారం చెరువులో స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లి, ఈత కొడుతూ మధ్యలో పిట్స్ వచ్చి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. గ్రామస్తులు/తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం మంగాపురంతండాకు చెందిన ధనావత్‌రామదాసు-లక్ష్మిల పెద్ద కుమారుడు గోపి, తన స్నేహితులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం స్నానం చేయటానికి సమీపంలోని చెరువుమాదారం చెరువు వద్దకు వెళ్లారు. అలుగు సమీపంలో చెరువులోకి దిగి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా ఫిట్స్ రావటంతో నీళ్లలో మునిగి చనిపోయాడని తెలుస్తున్నది. సమీపంలోనే స్నేహితులు ఈత కొడుతూ గమనిస్తున్నప్పటికీ గోపికి ఫిట్స్ వచ్చి ప్రమాదంలో ఉన్నాడని గ్రహించలేక పోవటంతో రక్షించలేక పోయారని సమాచారం, గోపి మృతితో మంగాపురంతండాలో విషాదం నెలకొంది. మృతుడు నేలకొండపల్లి గౌతమి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

బాలికపై లైంగికదాడికి యత్నం

- నిందితులిద్దరూ మైనర్లే

బోనకల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏడో తరగతి విద్యార్థినిపై ఇద్దరు బాలురు లైంగికదాడికి యత్నించిన ఘటన మంగళవారం బోనకల్ మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం లో సదరు బాలిక తల్లిదండ్రులు పొలం పనికి వెళ్ల గా బాలిక ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదే అ దునుగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు మైన ర్లు పథకం ప్రకారం ఒకరు ఇంట్లోకి వెళ్లేలా మరొకరు తలుపు వేసి బయట కాపాలా ఉండే లా మాట్లాడుకుని బాలిక ఇంటికి చేరుకున్నారు. తరువాత వారిలో ఒకరు బలవంతంగా బాలికను లోపలికి తీసుకెళ్లి లైంగికదాడికి య త్నించాడు. ఈ క్రమంలో ఆ బాలిక విడిపించు కొని కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వస్తుండటాన్ని చూసిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధిత బాలిక పొలం పని నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పగా వారు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో ఇద్దరు మైనర్లపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బోనకల్ ఎస్ఐ మధుబాబు తెలిపారు. కాగా, మైనర్ బాలురలో ఒకరు 7వ తరగతి, మరొకరు 9వ తరగతి చదువుతున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పంచాయితీ పరిధిలో గల పుల్లప్పకుంట చెరువులో గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా పుల్లప్పకుంట చెరువులో కుళ్లిన అస్థిపంజరంతో తెలియడుతన్న ఓ మహిళ శవం కనిపించటంతో స్థానికంగా కొంత మంది వ్యక్తులు అందించిన సమాచారంతో పోలీసులు చెరువు వద్దకు చేరుకొని మహిళ మృతదేహంను బయటకు వెలికి తీశారు. ఈ సంఘటనపై గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఇచ్చిన పిర్యాదుతో ఎస్ఐ షాకీర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కోనేరుబజారుకు చెందిన టి.నాగలక్ష్మి, తన భర్త మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే తరుణంలో భార్యభర్తల మధ్య వాగ్వాదం జరగ్గా ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఘటనపై నాగలక్ష్మి తమ్ముడు రమేశ్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కుక్కల స్వైరవిహారం: ఐదు మూగజీవాల మృత్యువాత

ముదిగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేయడంతో మూడు గొర్రెలు, రెండు మేకలు మృత్యువాత పడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుండెల వెంకటేశ్వర్లు తన గొర్రెలు, మేకలను దొడ్లో కట్టివేయగా అర్ధరాత్రి సమయంలో కుక్కలు దాడి చేయడంతో మృతిచెందాయి. వీటి విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. గ్రామసమీపంలో ఎక్కడినుంచో కుక్కలను తీసుకు వచ్చి వదిలి పెట్టడంతో అవి రాత్రిపూట దాడులకు పాల్పడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. కుక్కలను నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కేటీపీఎస్ ఆసుపత్రి ఎదుట కార్మికుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

పాల్వంచ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అత్యవసర వైద్యం కోసం వచ్చిన కార్మికుడి పట్ల వైద్యురాలు దురుసుగా ప్రవర్తించిందని ఆరోపిస్తూ కేటీపీఎస్ కార్మికులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. కార్మికుల కథనం ప్రకారం కేటీపీఎస్ 5వదశలో జేపీఏగా విధులు నిర్వహిస్తున్న పద్మారావు సోమవారం రాత్రి డ్యూటీకి హాజరయ్యాడు. అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో తోటి కార్మికుల సహాయంతో కేటీపీఎస్ ఆసుపత్రికి వెళ్లాడు. ఆ సమయంలో నైట్ డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్ వెంటనే తలుపులు తెరవకుండా జాప్యం చేయడంతో అత్యవసరమని భావించిన కార్మికులు తలుపులు పగులగొట్టారు. దీంతో సదరు డాక్టర్ అసహనానికి లోనై కార్మికులతో దురుసుగా ప్రవర్తించింది. అనంతరం పద్మారావుకు పరీక్షలు నిర్వహించి, వైద్యం చేసి పంపించింది. అక్కడ నుంచి నేరుగా మరలా విధులకు హాజరైన పద్మారావు మహిళా డాక్టర్ ప్రవర్తించిన తీరును తోటి కార్మికులకు వివరించాడు. దీంతో కార్మికులు పెద్ద సంఖ్యలో మరలా ఆసుపత్రికి వచ్చి ఆసుపత్రి ఎదుట డాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మిక సంఘాల నాయకులు సైతం అక్కడకు చేరడంతో సుమారు రెండు గంటల పాటు అక్కడ వాతావరణం వేడెక్కింది. విషయం తెలుసుకున్న 5,6 దశల సీఈ ప్రభాకరరావు ఆసుపత్రి వద్దకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి వారిని శాంతింపజేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

చెల్లని చెక్కు కేసు కొట్టివేత

ఖమ్మంలీగల్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణం పాడురంగాపురానికి చెందిన తుమ్మల కృష్ణపై చెల్లని చెక్కుకేసులో నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ ఖ మ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు. ఖమ్మం పట్టణం వీడీవోస్‌కాలనీ కిచెందిన రాయల శ్రీనివాసరావు ఫిర్యాది వద్ద నిందితుడైన తుమ్మల కృష్ణ తన కుటంబ అవసరాల నిమిత్తం 10-02-2017న రూ.5లక్షల అప్పు తీసుకుని అదేరోజు ప్రామిసరి నోటు రాయించి ఇచ్చాడు. ఫిర్యాది తన అప్పు తిరిగి చెల్లించమని వత్తిడి చేయగా నిందితుడు రూ.5లక్షలకు 20-12-2019 న చెక్కు జారీచేశాడు. ఫిర్యాదుకి ఫిర్యాది తన ఖాతాలో చేసిన తర్వాత బ్యాంకు వారు రిటర్న్ చేయగా ఫిర్యాది లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా కేసుని విచారించిన న్యాయధికారి నిందితునిపై నేరం రుజువుకాకపోవడంతో కేసు కొట్టివేస్తూ తీర్పుచెప్పారు. నిందితుడిన తరుపున న్యాయవాది నేరెళ్ల శ్రీనివాసరావు వాదించారు.

ఇరు జిల్లాల్లో 22 కిలోల గంజాయి పట్టివేత



మధిరలో పట్టుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

భద్రాచలం/మధిర అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధి కారులు పట్టుకున్నారు. ఒడిషాలోని కలి మెల నుంచి భద్రాచలం మీదగా హైదరాబా ద్‌కు ఎండు గంజాయి తరలిస్తుండగా ఆర్టీఏ చెక్ పోస్ట్ వద్ద ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది వాహన తనిఖీలు జరిపి పట్టుకున్నారు. ఈ సమయంలో ప్రదీప్ సర్కార్, కుర్ర ఇంద్రలను అదుపులోకి తీసుకోగా వారి నుంచి 12.5 కేజీల గంజాయి తో పాటు ఒక సెల్ ఫోన్, ఓ స్కూటీ ని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్స్ కరీం, బాలు కానిస్టేబుల్స్ సుధీర్, వెంకట్, హనుమంతరావు, హరీష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పదికిలోలు..

మధిర (ఆంధ్రజ్యోతి): కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా రవాణా అవుతున్న పది కిలోల గంజాయిని మధిరలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం ఒడిషా నుంచి మహారాష్ట్రకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో నిఘా ఏర్పాటుచేశారు. అందులో బాగంగా మధిర ఎక్సైజ్ పోలీసులు మంగళవారం ఉదయం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను తనిఖీ చేస్తుండగా జనరల్ బోగీల్లో అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులు కనిపించడంతో తనిఖీ చేశారు. వాటిల్లో పదికిలోల గంజాయి దొరికింది. దీనికి సంబంధించిన వారు ఎవరూ పట్టుబడలేదు. బ్యాగులను సీజ్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు సీఐ రామ్మూర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ రామ్మూర్తి, ఎస్ఐ జనార్ధన్‌రెడ్డి, కానిస్టేబుల్స్ గోపి, రియాజ్, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాల నిగ్గు తేలుస్తారా?

- వారం రోజులుగా రెండు మండలాల్లో జరిగిన క్షేత్రస్థాయి పరిశీలన
- అవినీతి ఆరోపణల మండలాల్లో జరగని ఆడిట్
- ఐదేళ్ల ఆడిట్ నాల్గు రోజుల్లో ముగింపునకు ప్రయత్నాలు
- ఐదేళ్ల ఆడిట్‌పై డీఆర్డీఏలో చర్చ

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు లేని సమయంలో వ్యవసాయ కార్మికులకు, కూలీలకు, చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి కల్పించేందుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. కూలీలకు ఉపాధి కల్పించాల్సిన పథకం ఉపాధి ఉద్యోగులకు అక్రమంగా ఉపాధి కల్పిస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఆడిట్ జనరల్ స్థాయిలో ఆడిట్ కార్యక్రమాలను నిర్వహించి క్షేత్రస్థాయిలో జరిగిన అవినీతిని బయట పట్టేందుకు ఆడిట్ ప్రక్రియను ఏర్పాటు చేసింది. అయితే కరోనా రావడంతో జిల్లాలో 2019 తర్వాత ఏజీ ఆడిట్ జరగలేదు.

ఈ సంవత్సరం నిర్వహించిన ఉపాధి పనుల్లో కామేపల్లి, ఏన్కూరు, పలు మండలాల్లో ఉపాధి అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావటంతో పూర్వ కలెక్టర్ వీపీ గౌతమ్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. కామేపల్లి మండలంలో అవినీతి రుజువు కావటంతో అక్కడ క్షేత్రసహాయకులు, టీం లీడర్లపై వేటు వేశారు. సాంకేతిక నిపుణునికి స్థాన చలనం జరిగింది.

ఐదేళ్ల తర్వాత ఉపాధి హామీ పనుల పరిశీలనకు వచ్చిన ఆడిట్ జనరల్ బృందాలకు అవినీతి జరిగిన మండలాలు కాకుండా అత్యధిక పని దినాలు జరిగిన రఘునాథపాలెం, తల్లాడ మండలాలను జిల్లా అధికారులు కేటాయించారు. వారం రోజులుగా క్షేత్రస్థాయిలో ఆడిట్ బృందాలు రెండు మండలాల్లో పర్యటించారు.

ఉపాధి అక్రమాలు నిగ్గు తెలుస్తారా..

క్షేత్రస్థాయిలో ఉపాధి అక్రమాలు జరిగేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖలోని కొంతమంది అధికారుల హస్తం ఉందనేది బహిరంగ చర్చకు దారి తీసింది. ఓ అధికారి ప్రమోషన్‌ను కూడా వదులుకొని పదేళ్లకు పైగా ఒకే హోదాలో పనిచేస్తున్నారు. ఇదే క్రమంలోనే మరి కొంతమంది ఉపాధి అధికారులు, ఉద్యోగులు ఉపాధి అక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి.

నిబంధనల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖలో 24 బ్యాంకు ఖాతాలు ద్వారా నిర్వహణ జరుగుతుంది. ప్రతి రూ. లక్ష చెల్లింపులకు కలెక్టర్ అమోదం ఉండాల్సి ఉంటుంది. నిధుల వినియోగం నుంచి డీఆర్‌డీఏ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో పాటుగా పొరుగు సేవలపై వచ్చిన అధికారులు, ఉద్యోగులు వారికి చెల్లింపులు వంటి అనేక అంశాలను ఆడిట్ జనరల్ బృందాలు పరిశీలన చేయాల్సి ఉంటుంది. ఒక్క ఏడాది రికార్డులు పరిశీలించటానికే వారం రోజులు వరకు పడుతోందని చర్చ జరుగుతుంది. కానీ ప్రస్తుతం జరుగుతున్న ఐదేళ్ల ఆడిట్‌ను మూడు రోజుల్లోనే మమ అనిపిస్తున్నారా.. అనే విమర్శలు వెలువడుతున్నాయి.



డీఆర్డీఏలో ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధి పనులపై మాత్రమే ఆడిట్

వెంకటేశ్వరరావు, ఆడిట్ అధికారి

2019నుంచి జరిగిన ఉపాధి పనులపై మాత్రమే ఆడిట్ జరుగుతుంది. మండలాల ఎంపిక అనేది ఢిల్లీ స్థాయిలో నిర్ణయం జరుగుతుంది. ప్రస్తుతానికి ఉపాధి హామీకి చెందిన ఒక్క బ్యాంకు అకౌంట్ వివరాలను పరిశీలన చేస్తున్నాం. శనివారం వరకు డీఆర్డీఏలో ఆడిట్ జరుగుతుంది. ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలు ఉంటే మా దృష్టికి తీసుకరావోచ్చు.

19, 20 తేదీల్లో ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 క్రీడా ఎంపికలు



ఖమ్మంస్పోర్ట్స్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):జిల్లాస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఈనెల19,20 తేదీల్లో క్రీడాఎంపికలు నిర్వహించనున్నట్లు ఎజీఎఫ్ జిల్లాసెక్రెటరీ నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 19న అండర్-14, 17 బాల, బాలికలకు షూటింగ్, స్క్వాష్ 20న బాస్కెట్‌బాల్, స్కేటింగ్, చెస్ విభాగాలతో పాటు అండర్-17 బాల, బాలికలకు ఖో-ఖో విభాగాలలో క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇతర సమాచారం కోసం 8019952592 నెంబరును సంప్రదించాలని కోరారు.

మీకు తెలుసా ?

తొలి తరం వస్త్ర సోయగం కమాన్ బజార్



ఖమ్మంసాంస్కృతికం,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ప్రధాన వీధుల్లో కమాన్ బజార్ ఓ ప్రత్యేకతను కలిగి ఉంది. ఈ వీధికి పట్టణ చరిత్రలో పురాతన చరిత్ర ఉంది. మధ్య గేటు ప్రాంతంలోని రావిచెట్టు వద్ద నుంచి మసీదు వరకు కమాన్ బజార్ విస్తరించి ఉంది. వస్త్ర, వ్యాపారాలతో విలసిల్లుతుండటం వల్ల ఈవీధికి ఉమ్మడి జిల్లాలో నే కాక పరిసర జిల్లాల వారికీ పరిచితం. అప్పట్లో ఈ వీధిలో మసీదు వద్ద ఒక ఇనుప ఆర్చిని ప్రవేశ ద్వారంగా ఏర్పాటు చేయటంవల్ల కమాన్ బజార్ అనే పేరు వచ్చిందని అప్పటి తరం వారి అభిప్రాయం. ఇనుప కమ్మీని ఊర్దూలో కమాన్ అని పిలుస్తారు కనుక కమాన్ బజార్ పేరు స్థిరపడింది అని చెబుతుంటారు. కాగా మరికొందరు మాత్రం.. వీధిలో చాలా వరకు ఇళ్లకు ఒంపులు తిరిగిన డిజైన్‌తో ఆర్చిలు ఉండేవి.. కనుక ఆ పేరు వచ్చిందని మరికొందరు చెబుతుంటారు. ఆధునికత నేపథ్యలో కాలక్రమేణా పురాతన ఇళ్లను కూల్చి వేసి అప్పటి ఆర్చిలను తొలగించినా, మసీదు వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన ఇనుప ఆర్చిని తొలగించినా వీధికి కమాన్ బజార్ అనేపేరు మాత్రం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. కమాన్ బజార్ తొలి తరం వస్త్ర దుకాణాల విపణి కావటం విశేషం. జిల్లా వ్యాప్తంగా ప్రజలు కమాన్ బజార్‌లో వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు కొనుగోలు చేసేవారు. నగరం విస్తరించిన నేపథ్యంలో ఇతర ప్రాంతాల్లో మరింత ఆధునిక వస్త్ర దుకాణాలు ఏర్పాటై వ్యాపారాలు అటువైపు విస్తరించినా కమాన్ బజార్ మాత్రం నేటికీ తన ఉనికిని కలిగి ఉంది..

పనుల్లో జాప్యం.. ప్రజల్లో అసహనం

- ఈ కార్యాలయంలో నిలువెల్లా నిర్లక్ష్యం
- ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం
- అర్బన్ తహసీల్దార్ కార్యాలయం అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



ఖమ్మంటౌన్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అర్బన్ తహసీల్దార్ కార్యాలయం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. సిబ్బంది కొరత అంటూ సాకులు చెబుతున్నా చిన్న పనులు చేయటంలో విపరీతమైన జాప్యం చేస్తున్నారు. ప్రతి పనికీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సాక్షాత్తు కలెక్టర్ అర్బన్ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను సరెండర్ చేశారంటే కార్యాలయంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఏ పనైనా అంతే..

చిన్న పనైనా, పెద్దదైనా అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రోజుల తరబడి పెండింగ్‌లో ఉంటున్నది. నగరానికి చెందిన ఒక మాజీ కౌన్సిలర్ సమాచార హక్కు ద్వారా సమాచారం అడిగితే ఏకంగా ఏడాది పాటు తిప్పించారు. రికార్డులు లేవని ఒకసారి, సిబ్బంది అందుబాటులో లేరని, ఇలా సాకులు చెబుతూ సమాచారం ఇవ్వలేదు. అలాగే అధికారుల సంతకాలు ఫోర్జరీలు చేసి నకిలీ ఇళ్లపట్టాలు ఒక వ్యక్తి ఇచ్చి సొమ్ములు వసూలు చేయగా సదరు వ్యక్తిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తి ఇచ్చిన పట్టాను అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి పంపిన పోలీసులు సదరు పట్టా అసలుదా, నకిలీదా నివేదిక ఇవ్వాలని కోరినప్పటికీ నెలల తరబడి పట్టించుకోలేదు. ఇలా అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిపనిలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువపత్రాలు తీసుకోవాలంటే చుక్కలు కనబడతాయని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ (ఫ్యామిలీ మెంబర్) పత్రాలు, జనన, మరణ ధ్రువపత్రాలు జారీలో తీవ్రజాప్యం ఏర్పడుతోంది. ఈ పత్రాల కోసం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కార్యాలయానికి ఎప్పుడు వచ్చినా అధికారులు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సర్వేలకు వెళ్లామంటూ సమాధానం చెబుతున్నారు. అధికారుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తమ దరఖాస్తులను విచారణ చేసినా ధ్రువపత్రాలు ఇవ్వటం లేదని, నిత్యం కార్యాలయానికి వచ్చేందుకు వంద రూపాయల వరకు ఆటోలకు ఛార్జీలు అవుతున్నాయని ఒక మహిళ ఇటీవల కార్యాలయంలో రోదించిందంటే ఎంత నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారో అర్థం అవుతోంది. ధ్రువపత్రాలను వారంరోజుల్లోగా ఇవ్వాల్సి ఉండగా, మూడునెలలకు కూడా ఇవ్వటం లేదు.

తహసీల్దార్‌ను సరెండర్

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న జాప్యంపై సాక్షాత్తు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ స్వామిని కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. గత సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధ్రువపత్రాలు సకాలంలో ఇవ్వకపోవటంపై పలువురు ఉద్యోగాలు పొందే అర్హత కోల్పోయారని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని కలెక్టర్ ప్రశ్నించారు. ధ్రువపత్రాల నిమిత్తం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తుచేసుకున్న తరువాత గతంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో చెక్‌స్లిప్ తీసుకొని, ఆర్ఐలు నివేదిక ఇచ్చేవారు. తరువాత ధ్రువపత్రం వచ్చేది. ఇప్పుడు సిబ్బంది కొరత అని చెక్‌స్లిప్‌లు తీయటం లేదు. దరఖాస్తుదారుడు ధ్రువపత్రాల కోసం చూసి, తరువాత తహసీల్దార్ కార్యాలయానికి వస్తే అప్పుడు చూస్తున్నారు. దీనికి నెలల సమయం పడుతోంది. దీంతో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది.

సమగ్ర సస్య రక్షణ ద్వారానే మెరుగైన వ్యవసాయం

జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



పత్తిని పరిశీలిస్తున్న పుల్లయ్య

రఘునాథపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో సమగ్ర సస్య రక్షణ చర్యలు తీసుకోవటం ద్వారానే మేరుగైన వ్యవసాయ ఫలితాలు అందుతాయని ఎప్పటికప్పుడు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉండే ఏఈవోల సలహాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో పంటల నమోదు విధానాన్ని తనిఖీ చేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సోమవారం రఘునాథపాలెంమండలంలో పర్యటించారు. కొర్లబోడుతండాలో వరి, మిరప, పత్తి పంటల సాగును క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఏవో కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాకే ఆక్రమణల తొలగింపు

- నిపుణుల కమిటీ సూచనల మేరకు రిటైనింగ్ వాల్ డిజైన్
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 46వ డివిజన్‌లో స్మార్ట్ వాటర్ డ్రైన్ పనులకు శంకుస్థాపన



రాంక్యాతండాలో కల్లు గీత వృత్తిదారులకు కాటమయ్య రక్షణ కవచాలను అందిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంసంక్షేమ విభాగం/రఘునాథపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతనే ఎటువంటి ఆక్రమణలైనా తొలగిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. మంగళవారం ఖమ్మంలో 46వ డివిజన్‌లో రూ.1కోటితో నిర్మాణం జరగనున్న స్మార్ట్ వాటర్ డ్రైన్ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేసి మాట్లాడారు. నిపుణుల కమిటీ సూచనల మేరకు రిటైనింగ్ వాల్ డిజైన్ జరుగుతుందని వివరించారు. సెప్టెంబరులో వచ్చిన మున్నేరు వరదలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేశారని మంత్రి తుమ్మల అభినందించారు. నాళాలు, ఇళ్ల తొలగించే సమయంలో అధికారులు మానవదృక్పథంతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కమిషనర్ అభిషేక్‌అగస్త్య, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, కమర్తపు మురళీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మానికి నాల్గు దిక్కులా ఖబరస్థాన్‌లు

ఖమ్మం నగరానికి నాల్గుదిక్కుల ఖబర్‌స్థాన్‌లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రంజాన్ పండగకు ముందే మసీదులు మరమత్తులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. షాదీఖానా మరమత్మలకు రూ.50 లక్షలను మంజూరు చేయించానని ప్రకటించారు. మసీదుల మరమత్తులకు ఒక్కో మసీదుకు రూ.1లక్ష చొప్పున 63 మసీదులకు నిధులు మంజూరు జరిగాయని వివరించారు. ఈ మేరకు ఆయా మసీదుల నిర్వాహకులకు చెక్కులను అందించారు.

డొంక రోడ్లు నిర్మాణాలకు రూ.50 కోట్లు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని మారుమూల డొంకరోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్లు నిధులు కేటాయింపు చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హర్యాతండా, భద్యాతండా, రాంక్యాతండాలో రహదారులకు మంత్రి తుమ్మల శంకుస్థాపనలు చేసి మాట్లాడారు.

రాధమ్మకు నివాళి

ఖమ్మంరూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతండా గ్రామానికి చెందిన చల్లపల్లి శ్రీనివాస్ (కిసాన్) తల్లి చల్లపల్లి రాధమ్మ (80) రెండు రోజుల క్రితం మృతిచెందారు. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారి ఇంటికి వెల్లి రాధమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పూనకొల్లు నీరజ, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సైదబాబు, ఎలగొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

చావా బోస్‌బాబుకు ఘన నివాళి



రఘునాథపాలెం,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): విద్యాప్రదాత చావాబోస్‌బాబు మూడోవర్థంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రఘునాథపాలెంలో ఆయన విగ్రహానికి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం. వెంకటేశ్వరావు నివాళులర్పించారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి: జడ్పీ సీఈవో



అధికారులతో మాట్లాడుతున్న దీక్షారైనా

తిరుమలాయపాలెం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలకు సరఫరా అవుతున్న తాగు నీరు కలుషితం కాకుండా స్వచ్ఛమైన నీరు అందించాలని జడ్పీ సీఈవో దీక్షారైనా ఆదేశించారు. మంగళవారం తిరుమలా యపాలెం రైతు వేదికలో ఆర్‌డబ్ల్యుఎస్ పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీవర్షం మూలంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలకు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోయాయన్నారు. నీరు కలుషితం అవుతుందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం అవడంతో ప్రజలు అనారోగ్య బారిన పడే అవకాశం ఉందన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ పుష్పలత, డీఈ ఓంప్రకాష్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఏఈ ఖలీల్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మున్సిపల్ కమిషనర్ అగస్త్యకు వినతి ఇచ్చిన 27వ డివిజన్ కార్పొరేటర్ నగేష్



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ దొడ్డ నగేష్

ఖమ్మంవ్యవసాయం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ దొడ్డ నగేష్ మునిసిపల్ కమిషనర్ అగస్త్యకు వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో డివిజన్ ప్రజలతో కలిశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు పాడైపోయాయని వాటి మరమ్మతులకు కావాల్సిన ఫండ్స్ రిలీజ్ చేయాలని కోరారు. అలాగే మునిపల్ నీరు సమయానికి వదిలేలా చూడాలని కోరారు. పందులు, కుక్కలు, దోమలు, మురికి నీరు వంటి పలు సమస్యలతో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సీజన్ వ్యాధులు సంభవిస్తున్న తరుణంలో పందులు , కుక్కలు , దోమలు , మురికి నీరు నిలవడం వలన మరిన్ని వ్యాధులు సంభవించి అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో దండమూడి గిరిజ, మోదేపల్లి రాజలక్ష్మి, చేకుట్ల కుమారి, జెట్టి శిరీష,ఎంకే సత్యవతి, మేడవరపు చరిత , కొప్పుల అనూష, పత్రి అనసూర్య, ముత్రి మేకల రోహిత్, ముత్రాతి భారతి, గునుగుంట్ల నాగార్జున, దొడ్డ నాగరాజు, గంధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో సీఎంది అత్యుత్సాహం

ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చెన్నయ్య



మాట్లాడుతున్న చెన్నయ్య

ఖమ్మంచర్చికాంపౌండ్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యుత్సాహం చూపిస్తున్నారని ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణ బస్సు యాత్ర ఖమ్మం చేరుకుంది. ఈసందర్భంగా నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉన్న అధికారిక జనాభా లెక్కల ఆధారంగా దళితుల స్థితిగతులపై అధ్యయనం చేసి వెనుకబడిన కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. వర్గీకరణ సాకుతో దళితులను చీల్చి రిజర్వేషన్లను విచ్ఛిన్నం చేసే కుట్రలను చేయ వద్దని చెన్నయ్య విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా ఎస్సీ డిక్లరేషన్ ఎందుకు అమలు చేయలేదన్నారు. ఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదో తెలపాలన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రుల ఉపసంఘాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కమిటీలో మాలమంత్రిలేని చైర్మన్ చెన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో గుంతేటి వీర భద్రం, పల్లా రాజశేఖర్, లింగాల రవి కుమార్, చెరుకువ రామ చందర్, కొట్టెసుధాకర్, గుమ్మడి కనకరాజు,పేరం మల్లయ్య, దామల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

కామేపల్లి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కామేపల్లి పశువైద్యాధికారి జి. నాగులు సూచించారు. మంగళవారం కామేపల్లి పశువైద్యశాలలో పశువులకు టీకాలు వేశారు. ఈనెల 15నుంచి నవంబరు 14 వరకు ప్రతీ గ్రామంలో టీకాలు వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రాంబాబు, శిరీష, కార్తిక్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో నష్టపోతున్న విద్యార్థులు

ఖమ్మంటౌన్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఫీజురియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహించటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ విమర్శించారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు ఎస్‌కే. నాగుల్ మీరా, శివనాయక్, వంశీ, జిల్లా నాయకులు మనోజ్, రాకేష్, ప్రతాప్, గోపి, రోహిత్, సాయి నరేష్ పాల్గొన్నారు.

ప్రియదర్శినిలో కలాం జన్మదిన వేడుకలు

ఖమ్మంరూరల్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండలపరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.గోపాల్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ,తదితరులు పాల్గోన్నారు.

సామాజిక సేవాకార్యక్రమాల్లో ముందుండాలి

ఖమ్మంటౌన్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన యంగ్ కమ్యూనిస్టు వర్క్‌షాప్‌లో మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని యువత అధ్యయనం చేసి, అవగాహన పెంచుకోవాలన్నారు. దేశభవిష్యత్, అభివృద్ధి యువత చేతులోనే ఉందని, యువత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌లో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల ప్రభాకర్, షేక్ బషీరుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రమేష్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు పొనుకుల సుధాకర్, తుడుం ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిరుమలాయపాలెం, అక్టోబరు15: మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలవాలని నాబార్డు సాయి స్వచ్ఛంధ సంస్థ సీవో ఇ.వెంకన్న తెలిపారు. మంగళవారం మండంలోని బచ్చోడులో 30మంది మహిళలకు కుట్టుమిషన్లు, మగ్గం, కంప్యూటర్, అంబ్రాయిడరింగ్ వర్కుతో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, తిమ్మిడి హనుమంతరావు, వి.రామయ్య, సైదులు, సీవో సరిత పాల్గొన్నారు.

అర్బన్ తహసీల్దార్‌గా రవికుమార్



ఖమ్మంటౌన్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా వరసా రవికుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన సీహెచ్. స్వామి ధ్రువపత్రాలు ఇవ్వటంలో నిర్లక్ష్యం వహించినందుకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. అనంతరం అర్బన్ తహసీల్దార్‌గా ఎన్నికల విబాగం డిప్యూటీ తహసీల్దార్ కల్పనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తరువాత తల్లాడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవికుమార్‌ను ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రవికుమార్ రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు.

యాసంగిపై స్పష్టత కోసం...

అన్నదాతల నిరీక్షణ

» ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలు
» రబీలో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలపైనే రైతుల ఆశలు
» స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నదాతల వినతి



వైరా రిజర్వాయర్

వైరా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆయకట్టులో యాసంగి(రబీ)సాగుకు నీటి సరఫరాపై ప్రభుత్వం నుంచి స్పష్టతను అన్నదాతలు ఆశిస్తున్నారు. ఇప్పటికే నాలుగునెలల వానాకాలం(ఖరీఫ్) సీజన్ ముగిసింది. అక్టోబరు నెల నుంచి రబీ వ్యవసాయ కాలం మొదలైంది. వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆదునికీకరణ కోసం ఫేజ్-2లో రూ.42.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ ఆధునికీకరణ పనుల కోసం ఆగస్టు 9న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఈ నిర్మాణాలకు సంబంధించిన టెండర్లు కూడా ఆహ్వానించారు. కొద్ది రోజుల్లో వచ్చిన టెండర్లను తెరిచి ఆతర్వాత ఒప్పంద కార్యక్రమాలను పూర్తిచేసి ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల అనంతరం ఈ ఆధునికీకరణ పనులను ప్రారంభించేందుకు నీటిపారుదలశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వ స్పష్టతపైనే రబీ సాగు...

రూ.42.10కోట్లతో కుడి, ఎడమకాల్వల ఆధునికీకరణ పనులు చేయనున్నందున రబీలో ఈ రెండు కాల్వలకు సాగునీటి సరఫరాపై ప్రభుత్వం నుంచి అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు. ఫేజ్-1లో దాదాపు రూ.65కోట్లు వెచ్చించి కుడి కాల్వలో ఏడు కిలోమీటర్లకుపైగా సిమెంట్ గ్రైడ్‌వాల్స్‌ను నిర్మించారు. ఆక్విడెక్టులను పునర్నిర్మించారు. రిజర్వాయర్‌కు ఐదో అలుగును నిర్మించారు. ఇంకా 20కిలోమీటర్లకుపైగా కాల్వకు ఆధునికీకరించాల్సి ఉంది. అలాగే ఎడమకాల్వలో ని ఆక్విడెక్టులను పునర్నిర్మించి 9.33కిలోమీటర్ల వరకు సిమెంట్ గ్రైడ్‌వాల్స్‌ను నిర్మించారు. ఇంకా 8కిలోమీటర్లకుపైగా కాల్వలను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఫేజ్-2లో కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టే అవకాశమున్నందున రబీలో సాగునీటి సరఫరా చేస్తారా...? లేదా అనే సందేహాలు రైతుల్లో నెలకొని ఉన్నాయి.

ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్ రైతాంగాన్ని నష్టపెట్టింది. మొదట్లో తీవ్ర వర్షాభావంతో సేద్యం ఆలస్యమైంది. ఒక మోస్తరు వర్షాలు కురిసి పైర్లు వేసిన తర్వాత అవి తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాటికి తోడు ప్రకృతి వైపరీత్యాలు రైతును కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి.

గత ఏడాది నిరాశపరిచిన యాసంగి సాగు

వైరా ఆయకట్టు రైతులు తీవ్ర నీటి ఎద్దడితో గత ఏడాది యాసంగి సేద్యానికి దూరంగా ఉండిపోయారు. ఈ ఏడాది ఖరీఫ్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ అడిశయాలే అయ్యాయి. ఈ రబీలో వరి, మిర్చి, మొక్కజొన్న సేద్యంపైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పెసర, పత్తి పంటలు దెబ్బతినడంతో రైతులు చాలావరకు వాటిని దున్నేశారు. మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ పంటలు సాగుచేస్తే కనీసం ఏప్రిల్ వరకు సాగునీరు అవసరముంది. అలాగే యాసంగి వరి సాగుచేస్తే మే వరకు నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎన్నెస్పీలో నీటి లభ్యత ఉన్నప్పటికీ వైరా కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టే అవకాశమున్నందున నీటి సరఫరా చేస్తారా..? లేదా అనే డోలాయమానంలో రైతులు ఉన్నారు. ఒకవేళ కాల్వల పనులు చేసినప్పటికీ కుడి కాల్వ 8వ డిస్ట్రిబ్యూటరీ, ఎడమకాల్వ 12వ డిస్ట్రిబ్యూటరీ వరకు నీటి సరఫరాకు ఎలాంటి సమస్య ఉండదు. అందువలన రబీ నీటి సరఫరాపై ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం నుంచి స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, నీటిపారుదలశాఖ అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

తల్లాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో మంగళవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక గౌడ బజార్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు, హిందూ తెలంగాణ ధర్మసేన కన్వీనర్ సుదర్శన్ ప్రసాద్ తివారీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

వైరా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం(కనకగిరి) గ్రామంలో నూతనంగా ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు సాధించిన ఐదుగురు యువతీయువకులను సోమవారం రాత్రి గ్రామస్థులు సన్మానించారు. షేక్.లతీఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులుగా నియామకం పొందిన ఐనాల భరత్, కొత్తపల్లి శివప్రసాద్, ఇనుపనూరి ఉపేందర్, పూర్ణకంటి రాణి, కంభంపాటి నవ్యలను సన్మానించి అభినందించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మట్టూరి కోటేశ్వరరావు, గ్రామపెద్దలు శెట్టిపల్లి శ్రీనివాసరావు, ఐనాల కనకరత్నం, మట్టూరి సత్యనారాయణ, చప్పిడి చిన్నపెద్దులు, గంగదేవుల నర్సయ్య, నారపోగు కిరణ్, నాగరాజు, వాకదాని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

చింతకాని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నల్లమోతు శేషగిరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అంబటి వెంకటేశ్వర్లు, వంకాయలపాటి వెంకట లచ్చయ్య, ఆళ్ల శ్రీనివాసరావు, యల్లంపల్లి నాగేశ్వరరావు, నాదెండ్ల వెంకటరత్నం, సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు పీవోఎస్ ద్వారానే జరపాలి: ఏడీఏ

తల్లాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి డీలర్ ఎరువుల అమ్మకాలు పీవోఎస్ మిషన్ ద్వారానే జరపాలని వ్యవసాయశాఖ సత్తుపల్లి ఏడీఏ బి.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం తల్లాడ రైతువేదికలో వ్యవసాయశాఖ, క్రిబ్కో ఆధ్వర్యంలో సత్తుపల్లి, మధిర డివిజన్ల ఎరువుల డీలర్ల అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పీవోఎస్ మిషన్‌లో ఎరువుల లైసెన్స్ వివరాలు నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ.తాజుద్దీన్, క్రిబ్కో సీనియర్ మేనేజర్ ఎం.మునిరెడ్డి, మేనేజర్ వి.నాగరాజు పాల్గొన్నారు.

చలమాల ఆశయాలు కమ్యూనిస్టులకు ఆదర్శం

» సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్

పెనుబల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు చలమాల సూర్యనారాయణ ఆశయాలు కమ్యూనిస్టులకు ఆదర్శమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్ అన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన సూర్యనారాయణ 42వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యనారాయణ చిత్రపటానికి జిల్లా కమిటీ సభ్యులు భూక్యా వీరభద్రం, చలమాల విఠల్‌రావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు కాటినేని శ్రీనివాసరావు, కవి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, తాండ్ర రాజేశ్వరరావు, వేముల సురేష్, కండే సత్యం, పంతంగి వెంకటేశ్వరరావు, మిద్దే స్వామి, మిట్టపల్లి నాగమణి పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి: ఐఎఫ్‌టీయూ

తల్లాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల కోసం కార్మికులను ఐక్యం చేసి పోరాడాల్సిన బాధ్యత ఉందని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తల్లాడలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు షేక్.లాల్‌మియా, రాఘవ, రామకృష్ణ, కృష్ణ, పుల్లారావు, సైదా, వెంకటేశ్వర్లు, బాలాజీ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేపడితే చర్యలు

● తహసీల్దార్ సునీత ఎల్జిబెత్

ముదిగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ హెచ్చరించారు. మంగళవారం ముదిగొండ మండలం పెద్దమండవ మున్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా చేపట్టకుండా ఎక్స్‌కవేటర్‌తో గాడిని తీయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు నరేష్, రోహిత్, ఆర్‌ఐలు ప్రసన్నకుమార్, వహీదాబేగం పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించేలా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌చందర్

బోనకల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించేలా అధికారులు కృషి చేయాలని ఏడీఏ విజయ్ చందర్ సూచించారు. స్థానిక రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి వ్యవసాయాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీకి సంబంధించి రేషన్ కార్డులు లేని వారికి కుటుంబ సభ్యుల నిర్ధారణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ అంకితబావంతో పని చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోలు విజయభాస్కరరెడ్డి, సరిత, రాధ, నాగయ్య తదితరులున్నారు.

తాగునీటి సరఫరాపై సహాయకులకు శిక్షణ

తల్లాడ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాపై గ్రామ మంచినీటి సహాయకులకు మంగళవారం తల్లాడ మండలం మల్లవరం గ్రామంలోని రైతువేదికలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మిషన్‌భగీరథ శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణనునివ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సత్తుపల్లి డీఈ జయలక్ష్మి ప్రారంభించి, విద్యుత్ మోటర్ల వినియోగం, ప్రాథమిక మరమ్మతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ సింధు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బొగ్గుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జయంతి



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

సత్తుపల్లి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 1985-86 పదవ తరగతి పూర్వ విద్యార్థులచే ఏర్పాటు చేసిన భారత రత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వద్ద మంగళవారం పూర్వ విద్యార్థులు కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి కలాం అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాకోబు, జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, గట్టే వాసు, పోతం గిరి, కోటి మస్తాన్, షాకీర్, పాల్గొన్నారు.

గంజాయి అమ్మినా, వాడినా కఠిన చర్యలు: సీఐ



సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రాంమ్మూర్తి

మధిర, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి పదార్థాలు వినిగించినా, అమ్మినా కఠిన శిక్షలు అమలుచేయడం జరుగుతుందని ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి హెచ్చరించారు. మంగళవారం మధిరలోని రిహా బిటేషన్ కేంద్రంలో గంజాయి బాధితులకు అవగాహన కల్పించారు. గంజాయి భారీన పడిన వారు మళ్లీ వాటి జోలికి పోకుండా మంచి జీవితాన్ని గడపాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్ధన్‌రెడ్డి, నిర్వాహకులు గోపాలరెడ్డి, కానిస్టేబుల్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో ప్రపంచ గురువుగా భారతదేశం



పార్టీ సభ్యత్వం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ప్రధాని మోదీ నాయకత్వంలో మన దేశం ప్రపంచ గురువుగా నిలుస్తుందని బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, ఆ పార్టీ నాయకుడు తాండ్ర వినోదరావులు అన్నారు. మంగళవారం వారు సత్తుపల్లి పట్టణంలో ఆ పార్టీ ప ట్టణ అధ్యక్షుడు ఆచంటి నాగస్వామి ఆధ్వర్యంలో బీజేపీ సభ్య త్వ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, మైనారిటీ నాయకుడు రెహమతుల్లా, మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, మిట్టపల్లి నాగరాజు, మంద శివ, బానోతు విజయ్, తెనాలి అశోక్‌కుమార్, ఈడ గణేష్ గౌడ్, కార్తీక్ యాదవ్‌లు పాల్గొన్నారు.

సత్తుపల్లి మండలం, సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను బీజేపీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మంగళవారం కలిశారు. మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నమోదు కన్వీనర్ ఈవీ రమేష్, నాయుడు రాఘవరావు, మట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ చాటిన శ్రీవల్లిని అభినందించిన బీజేపీ నాయకులు

తల్లాడ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): నీట్‌లో ప్రతిభ కనపరిచిన తల్లాడకు చెందిన తమ్మిశెట్టి అక్షా శ్రీవల్లిని మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు, హిందూ ధర్మసేన తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ సుదర్శన్ ప్రసాద్ తివారీ అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, ఆపతి వెంకటరామారావు, చల్లా నాగులు, గాదె కృష్ణారావు, వాడవల్లి నాగేశ్వరరావు, రాయల రమేష్, పెరిక కిరణ్, నరేష్ పాల్గొన్నారు.

'భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రైవేట్‌పరం చేయటాన్ని వ్యతిరేకించాలి'

వేంసూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న భవన నిర్మాణ సంక్షేమబోర్డును ప్రైవేట్‌పరం చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని ఏఐటీయూసీ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మర్లపాడులో పిల్లి భాస్కర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబు, షేక్.సత్తార్, పి.రవి, నడ్డి వెంకటేశ్వరరావు, ప్రశాంత్, జయరాజు, అంబోతు రాంబాబు, నాగేంద్ర శ్రీనివాసరావు, రాఘవులు, శేఖర్, వెంకటేశ్వర్లు, కృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

సత్తుపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ కోరారు. మంగళవారం సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజును సత్తుపల్లిలో కలిసి వినతి పత్రం అందించారు. పీవీఎన్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని, కాలనీలో కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని చర్చించారు. జనక్ ప్రసాద్‌ను స్థానిక జేవీఆర్ ఓసీ ప్రాంగణంలో సన్మానించారు.

పరామర్శ

వైరా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైరాకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు వెంపటి రంగారావును మంగళవారం ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత పరామర్శించారు. రంగారావు ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లతో సుజాత మాట్లాడారు. రంగారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ప్రవీణ్ ఉన్నారు.

మధిర విద్యుత్ ఏఈ బదిలీ

మధిర, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మధిర రూరల్ మండలం విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్వరరావు ఖమ్మం అర్బన్ మండలానికి బదిలీ అయ్యారు. మంగళవారం మధిర ఏడీఈ కార్యాలయంలో ఉద్యోగులు ఏఈని ఘనంగా సన్మానించారు. సిరిపురం గ్రామాన్ని సోలార్ గ్రామంగా రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న తరుణంలో ఆయన బదిలీ కావడం పట్ల ప్రజల్లోనూ, శాఖ ఉద్యోగుల్లోనూ కొంత నిరుత్సాహం వ్యక్తమవుతుంది. ఈకార్యక్రమంలో డీఈ హీరాలాల్, ఏడీఈ అనురాధ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడాజ్యోతికి ఘన స్వాగతం

ఏన్కూరు/కొణిజర్ల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు పల్లె నుంచి పట్నం వరకు అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 3న ప్రారంభమైన సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ మంగళవారం ఆయా మండలాలకు చేరింది. ఈ సందర్భంగా అధికారులు, వ్యాయమ ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు.

నిత్యావసరాల పంపిణీ

వైరా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 14వ వార్డు ఇందిరానగర్ కాలనీలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కుక్కల బాబుకు మంగళవారం మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను గుడిమెట్ల రజిత అందజేశారు. బాబు కుటుంబానికి 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లను అందజేశారు. జీవీ.రోషన్, ఆదూరి ప్రేమ్‌కుమార్, పొన్నం శ్రీను పాల్గొన్నారు.

'ఇందిరమ్మ కమిటీలు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధం'

కారేపల్లి అక్టోబరు15:(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం జారీచేసిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ ఏజెన్సీ చట్టాలకు విరుద్ధమని అదివాసీ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఏజన్సీ ప్రాంతాలలో పీసా సభ్యుల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ పొదెం రామ్మూర్తి, తాటి రామారావు, జిల్లా కన్వీనర్ బొర్రస్వామి, మండల కన్వీనర్ పులసం భద్రయ్య, పొడుగు హరీష్, ముక్తి కోటేష్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు ఏర్పాట్లకు సన్నాహాలు

కారేపల్లి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ ప్రియ కొటాక్ జిన్నింగ్ మిల్లులో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం మిల్లులో అధికారులు పలు అంశలపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ

ముదిగొండ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వనంవారిక్రిష్ణాపురం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రమేష్‌బాబు, వైద్యసిబ్బంది, గోపాలమిత్రలు , రైతులు పాల్గొన్నారు.

